https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 54 శుక్రవారం 26-06-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## గంట ఎక్కువ పని చేయండి!

**ఎగ్గొట్టే వాళ్లతో పన్నులు కట్టించండి.. ముఖ్యమంత్రి సీట్లో మీ సోదరుడున్నాడు**

**మీ కష్టాల్లో ప్రభుత్వం తోడుంటుంది.. కలిసి రాష్ట్రాన్ని నంబర్ 1గా నిలబెడదాం**

**నన్ను రేవంతన్న అంటేనే సంతోషం.. పీఆర్సీ త్వరలో అమలు చేస్తాం**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు.. ఉద్యోగుల బీమా పథకం ప్రారంభం**



**హైదరాబాద్, జూన్ 25**
ఉద్యోగుల విశ్వాసమే తమ బలం అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఒక గంట అదనంగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. మీ సోదరుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నారని, అందరం కలిసి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురువారం ఆయన ఉద్యోగుల ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఉద్యోగులకు బీమా రక్షణ గురించి ఉప ముఖ్యమంత్రి భట్టి తన వద్దకు వచ్చి చెప్పినపుడు సాధ్యమవుతుందని నమ్మలేదన్నారు. సింగరేణిలో తొలుత అమలు చేద్దామని ఆయన సూచించారని, కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.1.20 కోట్ల వరకు బీమా వస్తుందని చెప్పారని వెల్లడించారు. కార్మికుడు, ప్రభుత్వం పైసా చెల్లించకుండా ఈ పథకం ఎలా సాధ్యం అవుతుందని తాను ప్రశ్నించానన్నారు. భట్టి ఉద్యోగుల వేతనాల లావాదేవీలు నిర్వహించే బ్యాంకర్లతో మాట్లాడి ఇందుకు ఒప్పించారని చెప్పారు. 45 మంది సింగరేణి కార్మికులు మృతి చెందితే ప్రతి కుటుంబానికి రూ.కోటి పైగా చెక్కులు అందాయని తెలిపారు. మధ్య తరగతి కుటుంబాలది ఇంట్లో కష్టాలను బయటకు చెప్పుకోలేమని మనస్తత్వమని, ఎవరేమనుకుంటే మనకెందుకులే అని బరితెగించి వీధుల్లో తిరగలేరని వ్యాఖ్యానించారు. తానూ అక్కడి నుంచే వచ్చానని, చెప్పుకోలేని బాధ, తీర్చలేని సమస్య ఉన్నప్పుడు కష్టాల్లో ఉన్న కుటుంబానికి విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. బతికున్నప్పుడు మిగతా 2లో...

## క్యూర్ పరిధిలో 10 అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లు

**ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, జూన్ 25**
కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లను అంతస్తుల వారీగా నిర్మిస్తామని, ఒక్కొక్కటి 10 అంతస్తులతో ఉంటాయని మంత్రి పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యూర్ పరిధిలో ఈ ఏడాది లక్ష ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంగా పెట్టుకున్నామని, తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. క్యూర్ పరిధిలో 26 నియోజకవర్గాల్లో 20 చోట్ల స్థలాలు గుర్తించామని, ఈనెల 28 వరకు మిగిలిన ప్రాంతాల్లోనూ స్థలాలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా సిద్ధం చేయాలన్నారు. ఇళ్లకు సంబంధించి విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు.

## పోలీస్ స్టేషన్‌పై సైనికుల దాడి

**జమ్మూ, జూన్ 25:**



పోలీసు స్టేషన్‌పై దాడి చేసి, సిబ్బందిని గాయపరిచారన్న ఆరోపణలతో ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్ సహా పలువురు సైనికులపై కేసులు నమోదయ్యాయి. జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వాడ్ జిల్లా అథోలి పోలీసు స్టేషన్‌పై దాడి జరిగినట్టు గురువారం పోలీసు అధికారులు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన పేరుతో ఓ ఆర్మీ అధికారికి చెందిన ప్రయివేటు వాహ నాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడమే దీనికంతటికీ కారణమయింది. తాను అధికారిక సమావేశానికి పద్దార్ పట్టణానికి వెళ్లినప్పుడు ఈ 'క్రిమినల్ కుట్ర' చోటుచేసుకుందని ఆ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అమృత్ కోటచ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసులు నమోదయ్యాయి.

## యువతను ఉగ్రవాదులంటారా?

**ప్రధాన్ క్షమాపణ చెప్పి వైదొలగాలి: రాహుల్**

**న్యూఢిల్లీ, జూన్ 25:** కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి మండిపడ్డారు. నిరసన తెలుపుతున్న, ప్రశ్నిస్తున్న దేశ యువతను ఉగ్రవాదులతో ఆయన పోల్చారని.. ఇందుకుగాను వారికి క్షమాపణ చెప్పి.. అన్ని విధాలుగా విఫలమైన ఆయన రాజీనామా చేయాలని గురువారం 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. 'ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఎవరినైనా ద్రోహిగా చిత్రించడం బీజేపీ రాజకీయం. మోదీ ప్రభుత్వం అధికార మత్తులో కూరుకుపోయింది' అని రాహుల్ విమర్శించారు.

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టిన సీఎం

### కేటీఆర్



**చేవెళ్ల, జూన్ 25**
'హైదరాబాద్ రియల్‌ఎస్టేట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా గొయ్యితీసి బొంద పెట్టాడు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఒకప్పుడు కోట్ల రూపాయలు పలికిన భూముల ధరలు ఇప్పుడు పూర్తిగా పడిపోయాయని అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్‌పై నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రియల్‌ఎస్టేట్‌ను నమ్ముకుని బతికిన వేలాదిమంది ఇప్పుడు రోడ్డున పడ్డారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. షాబాద్ పరిసరాల్లో ఎకరా రూ.30లక్షలు ఉండేదని.. కేసీఆర్ హయాంలో పరిశ్రమలు రావడంతో ఎకరా రూ.3కోట్లుకు చేరిందని, ఇప్పుడు అమాంతం పడిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. పేదల ఇళ్లు కూలుస్తూ సీఎం పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 72సార్లు ఢిల్లీకి వెళ్లినా.. 70పైసలు కూడా తీసుకురాలేదని ధ్వజమెత్తారు.

## జలజగడాలకు చెక్!

- తుంగభద్ర సమస్యలపై హైలెవల్ కమిటీ
- కేంద్రం ఆప్షన్లు ఇస్తుంది.. మంచివి ఎంచుకోండి
- జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచన
- దేశంలో డ్యాంల పూడికతీతకు భారీ ప్రణాళిక
- దీంతో తుంగభద్ర సామర్థ్యం 30 శాతం పెరుగుతుంది
- పరస్పర సహకారంతోనే తుంగభద్రకు 33 కొత్త గేట్లు
- నదుల లింకింగ్‌తో భారత్ ఏకతాటిపైకి: పాటిల్
- ఐకమత్యంతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం
- ఇచ్చిపుచ్చుకుంటేనే ప్రయోజనం: చంద్రబాబు
- తుంగభద్ర గేట్ల ఆధునికీకరణతో 3 తరాల నీటి సమస్యకు పరిష్కారం: రేవంత్
- రైతుల కోసం సమన్వయంతో పనిచేస్తాం: డీకే

**బళ్లారి/అమరావతి, జూన్ 25**
తుంగభద్ర నదీ జల వివాద పరిష్కారం కోసం కేంద్రం నేతృత్వంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులతో 'హైలెవల్ కమిటీ (ఉన్నత స్థాయి కమిటీ)' వేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఈ కమిటీ 100 రోజుల్లోగా జల వివాదాల పరిష్కార చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. దాదాపు 70 ఏళ్లుగా తుంగభద్ర నీటి కోసం వివాదాలు నెలకొన్న నేపథ్యంలో వాటిని పరిష్కరించడానికి జలశక్తి మంత్రి చొరవ చూపారు. తుంగభద్ర డ్యాంకు ఏర్పాటు చేసిన కొత్త క్రస్ట్ గేట్లను పాటిల్ గురువారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, డీకే శివకుమార్, ఎ.రేవంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. తొలుత 17, 18, 19, 20వ నంబరు గేట్ల వద్ద పూజలు నిర్వహించి.. జాతికి అంకితం చేశారు. అనంతరం డ్యాం దిగువన కొప్పళ జిల్లా మునిరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఏపీ, కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. తుంగభద్ర సంబంధిత వివాదాల పరిష్కారం కోసం కేంద్రం సీనియర్ అధికారులతో త్వరలోనే ఉన్నత స్థాయి కమిటీ వేస్తుందని పాటిల్ తెలిపారు. ఈ కమిటీ కొన్ని ఆప్షన్లు ఇస్తుందని.. వాటిలో ప్రయోజనం చేకూర్చేవాటిని ఆయా రాష్ట్రాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ ప్రతిపాదనను ముగ్గురు సీఎంలు స్వాగతించారు. దేశవ్యాప్తంగా అనేక ఆనకట్టల్లో 15 శాతానికి పైగా పూడిక పేరుకుపోయిందని, దీంతో నీటినిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయిందని పాటిల్ చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూడిక తొలగింపు కోసం కేంద్రం సొంత నిధులతో త్వరలో భారీ ప్రణాళిక అమలు చేయనుందని తెలిపారు. దీని అమలు బాధ్యతను రాష్ట్రాలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. తుంగభద్ర జలాశయంలో కూడా 15శాతానికి పైగా పూడిక పేరుకుపోయిందని.. విజయవంతంగా పూడిక తీస్తే నీటి నిల్వ సామర్థ్యం 25 నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక మధ్య జలవివాదాలు ఉన్నప్పటికీ.. తుంగభద్ర డ్యాం గేట్ల ప్రారంభోత్సవానికి ముగ్గురు సీఎంలూ ఒకే వేదికపైకి వచ్చారని, సహకార భావంతో ముందుకు సాగడం చరిత్రాత్మక పరిణామమని పాటిల్ తెలిపారు. పరస్పర సహకారం, ఆర్థిక మద్దతుతోనే తుంగభద్ర జలాశయానికి అత్యవసరంగా 33 నూతన గేట్లను అమర్చడం సాధ్యమైందని గుర్తుచేశారు. నదీ జలాల విషయంలో ఉత్తరాది రాష్ట్రాలు సమన్వయంతో.. సామరస్యపూర్వకంగా వివాదాలకు తావులే కుండా పరిష్కరించుకుంటున్నాయని పాటిల్ వివరించారు.

మిగతా 2లో...

## పెను భూకంపంతో విలవిల..

# వణికిన వెనెజువెలా

**శిథిలాల కింద వేల మంది.. భారీ సంఖ్యలో మృతులు**

**నిమిషంలోనే 2 భారీ ప్రకంపనలు.. కరాకస్, లా గువైరాల్లో విధ్వంసం**



**కరాకస/న్యూఢిల్లీ, జూన్ 25:**
సెలవురోజు.. సాయంత్రం.. అంతా సందడిగా గడుపుతున్న సమయం.. ఒక్క నిమిషం.. కేవలం ఒకే ఒక్క నిమిషం.. వరుసగా రెండు భారీ ప్రకంపనలు.. ఎటు చూసినా విధ్వంసం.. పేకమేడల్లా కూలిన ఇళ్లు, భవనాలు.. దెబ్బతిన్న విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు.. జనం హాహాకారాలు.. శిథిలాల కింద నుంచి వినిపిస్తున్న ఆర్తనాదాలు.. వారి పరిస్థితిని తలచుకుంటూ కుటుంబ సభ్యుల రోదనలు.. ఎలాగోలా కాపాడుకునేందుకు హడావుడిగా ప్రయత్నా లు.. వెనెజువెలాలో సంభవించిన భారీ భూకంపం దృశ్యాలివి. ఈ విషాదంలో వందలాది మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. దీనితో ప్రాణనష్టం భారీగా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. గల్లంతైన, ఆచూకీ తెలియనివారి కోసం వెనెజువెలా నిర్వహించే వెబ్‌సైట్‌కు.. భూకంపం తర్వాత గురువారం రాత్రి వరకల్లా 28 వేల మందికిపైగా కనిపించడం లేదంటూ అభ్యర్థనలు అందాయి. భూకంపంతో లా గువైరా ప్రాంతం, రాజధాని కరాకస్ అతలాకుతలంకాగా, మోరన్, ఫాల్కన్ తదితర పట్టణాల్లోనూ తీవ్ర నష్టం జరిగింది. వందలాది భవనాలు కూలిపోయాయి. వేలాది భవనాలు బీటలువారి కూలిపోయే దశలో ఉన్నాయి. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. వెనెజువెలాలో బుధవారం సెలవురోజు.. అంతా సందడిగా గడుపుతున్నారు. సాయంత్రం 6.04 గంటల సమయంలో రిక్టర్ స్కేల్‌పై 7.2 తీవ్రతతో ఒక్కసారిగా భూమి కంపించింది.

మిగతా 2లో...

## గడువులోగా రహదారుల పనులు పూర్తి కావాలి

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: కేంద్ర మంత్రి గడ్కరీ**




న్యూఢిల్లీ, జూన్ 25
తెలంగాణలో చేపట్టిన జాతీయ రహదారుల పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో బుధవారం తెలంగాణ, జమ్మూకశ్మీర్, లడఖ్‌లో చేపట్టిన జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఆయన వేర్వేరుగా సమీక్షించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పర్యవేక్షక యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణా లను పెంపొందించేందుకు ఆధునిక సాంకేతిక తను వినియోగించుకోవాలన్నారు. రహదా రులపై మౌలిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వానాకాలంలో రోడ్లపై నీళ్లు నిలవకుండా చూడాలని, ఇందు కోసం సత్వర ప్రతిస్పందన బృందాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## ఢిల్లీ వీధుల్లో అడుగడుగునా నా పోస్టర్లే!

**అక్కడ పోటీ చేస్తే పది లక్షల ఓట్లు పడతాయన్నారు**

**2023 నాటి భారత పర్యటనను గుర్తుచేసుకున్న మెలోని**



**న్యూఢిల్లీ, జూన్ 25:**
ఇటలీ ప్రధాని జార్జియా మెలోని తన కొత్త పుస్తకం 'జార్జియాస్ విజన్'లో 2023 నాటి భారత పర్యటనకు సంబంధించిన ఒక విశేషాన్ని పంచుకున్నారు. తన రాకకు స్వాగతం పలుకుతూ ఢిల్లీ వీధుల్లో భారీగా పోస్టర్లు ఏర్పాటు చేశారని గుర్తుచేసుకున్నారు. 'నేను ఢిల్లీ వచ్చినప్పుడు రోడ్లపై అడుగడుగునా నా ఫొటోలతో కూడిన పోస్టర్లు కనిపించాయి. నేను తిరిగి వెళ్తున్నప్పుడు అదే చిత్రంతో కూడిన పోస్టర్లపై 'భారత్‌ను సందర్శించినందుకు ధన్యవాదాలు' అని రాసి ఉంది. ఆ పర్యటనలో నాతో పాటు వచ్చిన ఇటలీ ఉప ప్రధాని ఆంటోనియో తజనీ ఆ పోస్టర్లు చూసి ఆశ్చర్యపోయారు. ఢిల్లీ నియోజకవర్గం నుంచి మీరు పోటీ చేస్తే కచ్చితంగా పది లక్షల ఓట్లు సాధిస్తారని ఆయన చమత్కరించారు' అని మెలోని పేర్కొన్నారు. 'రెసినా డైలాగ్' సదస్సుకు హాజరయ్యేందుకు 2023 మార్చిలో, ఆ తర్వాత జీ20 శిఖరాగ్ర సమావేశం కోసం అదే ఏడాది సెప్టెంబరులో ఆమె భారత్‌ను సందర్శించారు. పాత్రికేయుడు అలెశాండ్రో సల్లూస్టీతో ఆమె జరిపిన సంభాషణల ఆధారంగా రూపొందిన ఈ పుస్తకానికి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ముందుమాట రాశారు.

# గంట ఎక్కువ పని.. (మొదటిపేజీ తరువాయి)

ఉన్న బంధుత్వాలు చితికి పోయినప్పుడు నిలబడవని అన్నారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వమే యజమాని కాబట్టి వాళ్ల కష్టసమయంలో ఆదుకోవాల్సిన బాధ్యతను గుర్తించి, 16 బ్యాంకులను ఒప్పించి ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. తన గురించి తాను ఒక సందర్భంలో గుంపు మేస్త్రీగా చెప్పుకున్నందుకు అవహేళన చేస్తున్నారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. తాను గుంపు మేస్త్రీనేనని, ఈ గుంపే తన బలమని, ఈ గుంపే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతుందని చెప్పారు. తాము దొరలమని, గడీలు ఉన్నాయని కొందరు చెప్పుకుంటారని, తనకు అలాంటి పోకడలు లేవని అన్నారు. ఎవరైనా తనను రేవంతన్నా అని పిలిస్తేనే తనకు ఇష్టమని ముఖ్యమంత్రి అన్నారు. సీఎం అయిన కొత్తలో ఉద్యోగులు తనను అన్నా అని పిలుస్తుంటే అధికారులు వచ్చి సార్ అని పిలవమని చెప్పే ప్రయత్నం చేశారని, మరోసారి అలా చేస్తే ముందు నీ ఉద్యోగం పోతుందని అధికారిని హెచ్చరించానని తెలిపారు. తన రాజకీయ జీవితంలోనూ జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ప్రజలు ప్రేమతో రేవంతన్న అని పిలిస్తేనే ఇష్టంగా ఉండేదన్నారు. అన్న అనేది శాశ్వతం అని, పదవులు వస్తాయి, పోతాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీల్లో 50 శాతం పాతవారే గెలిచారని, నిర్ణయాలు తీసుకునే 17 మందే మారారని చెప్పారు. తెలంగాణను పాలించిన గత పాలకులు పదేళ్లలో వందేళ్ల విధ్వంసం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. ఉద్యోగులకు మొదటి తేదీ జీతాలు ఇవ్వని పరిస్థితి ఉండేదని ప్రస్తావించారు. సకాలంలో వేతనాలు అందక రుణాలు తీసుకున్న ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. 2024 జనవరి 1 నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు వేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకోగానే విడతలవారీగా ఉద్యోగులకు జీతాలిస్తే వారితో పని చేయించుకోలేనని సీఎ?సకు స్పష్టం చేశానన్నారు. కేసీఆర్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచడం వల్ల మూడేళ్ల కిందటి పదవీ విరమణ ప్రయోజనాల మొత్తాల భారం నెలకు వెయ్యి కోట్లు అవుతున్నాయని తెలిపారు. ఉద్యోగుల విషయంలో తమ ఉద్దేశాల్లో తేడా లేదని, అమల్లో తేడా ఉంటే కూర్చొని పరిష్కరించుకుందామని సూచించారు. ఉద్యోగులు, తాము వేరు అన్న భావన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. పీఆర్సీ కూడా త్వరలో అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఖచ్చితమైన ప్రయత్నం చేస్తామన్నారు. ప్రతీ ఉద్యోగి రోజుకు ఒక గంట అదనంగా పని చేసి పన్నులు కట్టని అక్రమార్కులను కట్టడి చేస్తే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని సూచించారు. పెంచిన ఆదాయాన్ని ఉద్యోగులు, ప్రజల కోసమే ఖర్చు చేస్తామన్నారు. కాంగ్రెస్ రెండోసారి అధికారానికి వస్తే అది కూడా ఉద్యోగులు బాగా పని చేయడం వల్లనే సాధ్యమవుతుందని చెప్పారు. తాను రాష్ట్రాభివృద్ధి కోసం ఢిల్లీకి వెళ్తుంటే వెళ్లొద్దని విపక్ష నేతలు రోడ్లు ఎక్కుతున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. గత పదేళ్లలో ఈ పనులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడామని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక చేద్దామంటే కాళ్లలో కట్టెలు పెడుతూ అడ్డుకుంటు న్నారని ఆరోపించారు. ఫామ్ హౌస్‌లో ఉన్న వాళ్లకు మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణతో పని లేదని. అందుకే వాళ్లు అడ్డుకుంటున్నారని అన్నారు. గతంలో రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం గచ్చీబౌలి ఎయిర్‌పోర్టు మెట్రో ప్రతిపాదించారని, దాన్ని నిలిపేసి, సామాన్యుల కోసం పాతబస్తీ నుంచి ప్లాన్ చేశానని చెప్పారు.

# పెను భూకంపంతో విలవిల.. (మొదటిపేజీ తరువాయి)



ఇలా ఎక్కడ, ఎలా ఉన్నవాళ్లు అలా బయటికి పరుగెత్తారు. రెండు భారీ భూకంపాల తర్వాత కూడా స్వల్పస్థాయి ప్రకంపనలు కొనసాగాయి. దీనితో ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనతో బుధవారం రాత్రంతా వీధుల్లో, పార్కుల్లో, రోడ్ల పక్కన పార్క్ చేసిన కార్లలో ఉండిపోయారు. వెనెజువెలా రాజధాని కరాక్‌సలోని సిమోన్ బొలివర్ ప్రధాన విమానాశ్రయం దెబ్బతినడంతో మూసివేశారు. భూకంపంతో గురువారం మధ్యాహ్నం వరకు 164 మృతదేహాలను వెలికితీశామని, 971 మంది గాయపడ్డారని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ వెల్లడించారు. శిథిలాల తొలగింపు, సహాయక చర్యలు వేగంగా సాగుతున్నట్టు తెలిపారు. వెనెజువెలాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. దెబ్బతిన్న ఇళ్లు, ఆస్పత్రుల పునర్నిర్మాణం కోసం వెంటనే సుమారు రూ.1,890 కోట్ల (200 మిలియన్ డాలర్ల)తో ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

**బ్రెజిల్ వరకు ప్రకంపనల తీవ్రత**

వెనెజువెలాలో గత వందేళ్ల లో సంభవించిన అతి భారీ భూకంపం ఇదే కావడం గమనార్హం. ఈ ప్రకంపనల తీవ్రత వెనెజువెలాతోపాటు చుట్టుపక్కల ఉన్న కొలంబియా, బ్రెజిల్ సహా పలు దేశాల్లోనూ కనిపించింది. కరాక్‌సకు 1,700 కిలోమీటర్ల దూరంలోని బ్రెజిల్ పట్టణాలు మనౌస్, బెలెం, మకాపాలలో జనం ఇళ్లలోకి బయటికి పరుగెత్తారు.

**లా గువైరాలో భయానక దృశ్యాలు**

భూకంపంతో వెనెజువెలాలోని తీరప్రాంత పట్టణం లా గువైరాలో తీవ్రస్థాయిలో విధ్వంసం జరిగింది. పెద్ద సంఖ్యలో భవనాలు కూలిపోయాయి. దీనితో లా గువైరాను 'విపత్తు ప్రాంతం (డిజాస్టర్ జోన్)'గా ప్రకటించి.. భారీ స్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు. తీరానికి సమీపంలో ఉన్న ప్రముఖ 'హోటల్ ఎడ్వర్డ్' పూర్తిగా కుప్పకూలి, శిథిలాల దిబ్బగా మారిపోయింది. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే ఈ పది అంతస్తుల భవనంలో పార్టీలు, సమావేశాలు ఎక్కువగా జరుగుతుంటాయని.. అందులో ఎంతమంది చిక్కుకుపోయారో తెలియదని వెనెజువెలా అధికారులు తెలిపారు. ఇక ఆస్పత్రులు కూడా దెబ్బతినడం, విద్యుత్ సరఫరా లేకపోవడంతో క్షతగాత్రులకు చికిత్స అందించడంలో ఇబ్బంది ఎదురవుతోంది. లా గువైరాలో ఆస్పత్రుల బయట, వీధుల్లోనే చికిత్సలు అందిస్తున్న దృశ్యాలు కలిచివేస్తున్నాయి. చాలా చోట్ల విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో.. ఏం జరుగుతోందో, తమవారి పరిస్థితి ఎలా ఉందో తెలియక ప్రజలు ఆందోళనలో చిక్కుకుపోయారు. భూకంపంతో అతలాకుతలమైన వెనెజువెలాను ఆదుకోవడానికి ప్రపంచ దేశాలు ముందుకొచ్చాయి. భూకంపంపై సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలను, వైద్య సామగ్రి, మందులను వెనెజువెలాకు పంపినట్టు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. ఈక్వెడార్, ఖతార్, మెక్సికో, ఎల్ సాల్వెడార్ తదితర దేశాలు సహాయక బృందాలను, మానవతా సాయాన్ని వెనెజువెలాకు పంపాయి. 85 రెస్క్యూ బృందాలను పంపుతున్నట్టు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ తెలిపారు. వెనెజువెలాకు అవసరమైన సాయం అందజేస్తామని చైనా, స్పెయిన్, కొలంబియా తదితర దేశాలు ప్రకటించాయి. కాగా, వెనెజువెలాలో భూకంపం, ప్రాణ ఆస్తి నష్టంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెనెజువెలా ప్రజలకు సానుభూతి ప్రకటించారు. వెనెజువెలాలో వచ్చిన భూకంపాల్లో.. తొలి భూకంప కేంద్రం వెనెజువెలా తీరప్రాంత పట్టణం మోరన్‌కు పశ్చిమంగా 22 కిలోమీటర్ల లోతులో, రెండో భూకంప కేంద్రం అదే పట్టణానికి నైరుతి దిశలో 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్టు అమెరికా జియాలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) వెల్లడించింది. రెండూ కూడా కేవలం 39 సెకన్ల తేడాతో రిక్టర్ స్కేల్‌పై 7.2, 7.5 స్థాయిలో వచ్చాయని తెలిపింది. ఇలా వెంటవెంటనే రావడాన్ని 'డబ్లెట్' భూకంపంగా పేర్కొంది. సాధారణంగా 30 నుంచి 60 కిలోమీటర్ల వరకు లోతులో భూకంప కేంద్రాలు ఉంటుంటాయి. వాటితో ఉపరితలంపై పెద్దగా ప్రభావం ఉండదు. లోతు తగ్గినకొద్దీ ప్రభావం పెరుగుతుంది. ఇప్పుడు వెనెజువెలాలో వచ్చిన రెండో ప్రకంపన కేంద్రం కేవలం 10 కిలోమీటర్ల లోతులో ఉండటం, అదీ డబ్లెట్ భూకంపం కావడంతో నష్టం భారీగా ఉంటుందని యూఎ?సజీఎస్ పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో భూకంపం రావడంతో 10 వేల నుంచి లక్ష మంది వరకు మరణించే అవకాశం ఉందని తొలుత ప్రకటించింది. కానీ అంత భారీగా ప్రాణనష్టం ఉండకపోవచ్చని తర్వాత సవరించుకుంది.

# జలజగడాలకు చెక్.. (మొదటిపేజీ తరువాయి)

నదుల అనుసంధానం కోసం కేంద్రం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ నదీ జలాలను పారిస్తున్నాయని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు నేరుగా పైపుల ద్వారా పొలాల్లోకే నేరుగా సాగునీటిని తీసుకువెళ్తూ రెండు పంటలు పడిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కూడా కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుంటూ నదుల అనుసంధాన పథకాన్ని చేపట్టేందుకు ముందుకు రావాలని పాటిల్ సూచించారు.తమకొక రాష్ట్రం ఎక్కువ కాదు.. మరో రాష్ట్రం తక్కువా కాదని స్పష్టం చేశారు. రాష్ట్రాలు బాగుపడితేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని కేంద్రం బలంగా నమ్ముతోందన్నారు.

**రైతుల భవిత కోసం మూడు రాష్ట్రాల ఐక్యత**

**- కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ వెల్లడి**

తుంగభద్ర పరివాహక ప్రాంత రైతుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఐక్యంగా ఉండాలని చరిత్రాత్మక నిర్ణయానికి వచ్చాయని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సభలో అన్నారు. 'జలవనరుల శాఖ చరిత్రలో ఈ రోజు ఒక మైలురాయి. మన నీరు- మన హక్కు అనే భావనతో మూడు రాష్ట్రాల రైతుల సంక్షేమాన్ని కాపాడే దిశగా ఈ సమావేశం జరిగింది. తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల్లోనే స్టాప్‌లాక్‌ను అమర్చింది. భవిష్యత్‌లో డ్యాం భద్రతను దృష్టిలో ఉంచుకుని మొత్తం 33 స్పిల్‌వే గేట్లను మార్చే సాహసోపేత నిర్ణయం తీసుకున్నాం. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక నాయకత్వం కలిసి రైతుల ప్రయోజనాల కోసం ఒకే వేదికపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం దేశ చరిత్రలో అరుదైన ఘట్టం. రైతులకు జీతం లేదు, పదోన్నతి లేదు, పెన్షన్ లేదు అయినా దేశానికి అన్నం పెడుతున్నారు. అలాంటి రైతుల సంక్షేమం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత' అని చెప్పారు.

**బాబు పట్టుదలతో ఓ నగరమే అభివృద్ధి**

'బెంగళూరు సహజసిద్ధంగా అభివృద్ధి చెందిన నగరం. ఇక్కడి వాతావరణం, లాజిస్టిక్స్ నగరాభివృద్ధికి దోహదపడ్డాయి. కానీ హైదరాబాద్ పరిస్థితి అలా కాదు. ఆ నగరాన్ని చంద్రబాబు పట్టుదల, అనుభవం, దూరదృష్టితో ఐటీతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు' అని సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు. కొత్త గేట్ల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు కర్ణాటక వెళ్లిన చంద్రబాబు హోస్పేట్‌లోని ఐఆర్బీ అతిథిగృహంలో శివకుమార్, రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను, చంద్రబాబు ఇద్దరం యువజన కాంగ్రెస్ నుంచి వచ్చిన వారిమేనని.. ఆయన పోరాటస్ఫూర్తి, పట్టుదల, దూరదృష్టి గురించి పలు సందర్భాల్లో తాను మాట్లాడుతుంటానని చెప్పారు. కేంద్ర మంత్రి పాటిల్ సైతం.. దేశంలో అభివృద్ధిపై దృష్టి సారించిన నాయకుల్లో చంద్రబాబు ముందువరుసలో ఉంటారని చెప్పారు.

**చంద్రబాబు శ్రద్ధే కారణం**

**లేదంటే నాలుగైదేళ్లు పట్టేది: కన్నయ్యనాయుడు**

తుంగభద్ర డ్యాంకు యుద్ధప్రాతిపదికన కొత్త క్రస్ట్‌గేట్లను అమర్చడంపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపారని, లేకుంటే ఈ క్రస్ట్ గేట్ల అమరిక మరో నాలుగైదేళ్లు ఆలస్యమయ్యేదని ఇంజనీరింగ్/గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు అన్నారు. తుంగభద్ర డ్యాంపై ఆయన మాట్లాడారు. మరో 50 ఏళ్ల వరకూ డ్యాంకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తదని భరోసా ఇచ్చారు. దక్షిణాదిలో ఏ ప్రాజెక్టుకూ 60అడుగుల వెడల్పు గల గేట్లు లేవన్నారు.

## ఫిరాయింపులు: భలే ఖరీదైన బేరాలు!

కాల వైపరీత్యం! నిన్నటిదాకా తాము విమర్శించిన పార్టీలోనే నేడు చేరిపోతున్న ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగిపోతోంది. ఇటీవల బెంగాల్, మహారాష్ట్రలో చోటుచేసుకున్న తృణమూల్ కాంగ్రెస్, శివసేన ఎమ్మెల్యే, ఎంపీల ఫిరాయింపులే అందుకు నిదర్శనాలు. ఎటువంటి సంకోచాలు లేకుండా.. చేరిన క్షణమే, ఆ పార్టీ నాయకులతో బహిరంగంగా, చాలా కాలం తరువాత కలుసుకున్న పాత మిత్రుల్లా వ్యవహరిస్తున్నారు! ప్రజలు ఏమనుకుంటున్నారనేది ఈ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పట్టడం లేదు! నిజానికి ఫిరాయింపులు అనేవి కొత్త రాజకీయ పరిణామాలు కానేకావు. భారతదేశ రాజకీయాలలో పార్టీ ఫిరాయింపులకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. ఈ నీతిబాహ్య రాజకీయాల పట్ల ఇప్పుడు ప్రజల్లో ఎటువంటి పట్టింపు లేకపోవడమే దిగ్భ్రాంతికరం. ఫిరాయింపులకు పాల్పడినవారు తమను ఎన్నుకున్న ఓటర్లకుగానీ, విశాల ప్రజానీకానికిగానీ తమ నిర్ణయంపై ఎటువంటి వివరణ ఇవ్వడం లేదు. రాజకీయాలు వ్యాపార లావాదేవీల వ్యవహారమయ్యాయి. ఫిరాయింపుదారులకు, వారిని చేర్చుకున్న పార్టీకి మధ్య కుదిరిన ఒప్పందానికి షరతులు ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసు. రాజ్య వ్యవస్థ ఆర్థిక వనరులు అందుబాటులో ఉండడమనేది కూడా సదరు ఒప్పందంలో భాగంగా ఉంటోంది. ఇటీవల పార్టీ ఫిరాయించిన శివసేన ఎంపీ ఒకరు ఇలా చెప్పారు: 'నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు సాధించుకోవాలంటే నేను పార్టీ మారడం తప్పనిసరి'. ఫిరాయింపులను ప్రజల తీర్పును వంచించడంగా ఎవరూ ఇంకెంత మాత్రం భావించడం లేదు. అవి సాధారణ వ్యవహారాలైపోయాయి. అధికార సాధనకు ఫిరాయింపులూ మరొక మార్గమని ప్రజలు అంగీకరిస్తున్నారు! ఫిరాయింపులపై విమర్శలకు బీజేపీ మద్దతుదారులు అదే రీతిలో ప్రతిస్పందిస్తున్నారు: కాంగ్రెస్ విషయమేమిటి? దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఫిరాయింపులు జరగలేదా? 'ఆయారామ్, గయారామ్' అనే పరిహాసం ప్రాచుర్యంలోకి వచ్చింది నరేంద్ర మోదీ అధికారంలోకి రావడానికి చాలా కాలం ముందే కాదూ? 'అవును' అనేదే పై ప్రశ్నలన్నిటికీ సమాధానం. ఫిరాయింపులు భారత ప్రజాస్వామ్యమంత పాతవి. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వాలను రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బర్తరఫ్ చేశారు. పదవుల కోసం పార్టీ మారిన శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయ అవకాశవాదం బాగా వర్ధిల్లింది. నాయకులు పార్టీలు మారడంపై విమర్శలు రావడం పరిపాటి. అయితే ఆ విమర్శలకు పాలకపక్షం వారు ప్రతిస్పందిస్తూ 'గతంలో మీరూ అదే చేశారు కదా' అని పాత విషయాలను బయటకు తీసి ఎత్తిపొడవడం కూడా అంతే పరిపాటి. నాయకులు పార్టీలు మారడం అనేది కొత్తేమీ కాదు. ఇప్పుడు అసలు సమస్యేమిటంటే ఆ ఫిరాయింపుల స్వభావం పూర్తిగా మారిపోవడమే. కాంగ్రెస్ హయాంలో ఆధిపత్య పార్టీ వ్యవస్థకు తార్కాణంగా ఫిరాయింపులు ఉండేవి. ఇప్పుడు ఒక సర్వాధిపత్య పార్టీని సృష్టించి సుస్థిరం చేసే వ్యూహంలో భాగంగా ఫిరాయింపులు జరుగుతున్నాయి. నాటి నేటి ఫిరాయింపులలో ఈ వ్యత్యాసం సమకాలీన రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మార్పును వివరిస్తుంది. గత దశాబ్దకాలంలో నరేంద్రమోదీ, అమిత్‌షాల నేతృత్వంలోని బీజేపీ ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రంగా ఆవిర్భవించింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదొక అపూర్వమైన విషయమే, సందేహం లేదు. సంస్థాగత బలం, ఆర్థిక వనరులు, కమ్యూనికేషన్ సాధనాలు, నాయకత్వ నిర్మాణం మొదలైన అంశాలలో ఈ బీజేపీకి సమస్థాయి పార్టీ మరేదీ లేదు. ఎన్నికలలో బీజేపీ సాధిస్తున్న అప్రతిహత విజయాలకు ఆ శక్తి సామర్థ్యాలే కారణమని అంగీకరించవలసి ఉన్నది. అయితే ఆ ఘన విజయాలు ఒక కొత్త రాజకీయ తర్కాన్ని కూడా సృష్టించాయి. ఎన్నికల్లో విజయం సాధించడం ఇంకెంత మాత్రం అధికారంలో కొనసాగేందుకు ఒక మార్గం కాదు. దేశవ్యాప్తంగా సమస్త ఎన్నికలలోనూ విజయం సాధించడమే బీజేపీకి లక్ష్యంగా మారింది. ఈ దృక్కోణం నుంచి చూసినప్పుడు ఫిరాయింపులు కేవలం యాదృచ్ఛిక సంఘటనలు కాదు, అవి పార్టీలను స్వాధీనపరచుకునే వ్యూహాలు. ఫిరాయింపులు జరిగిన పద్ధతిని చూడండి.. జ్యోతిరాదిత్య సింధియా, ఆయన విధేయులు కాంగ్రెస్ నుంచి నిష్క్రమించిన తరువాత మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ప్రభుత్వం పడిపోయింది. మహారాష్ట్రలో శివసేన తొలి చీలికను చవిచూసింది. ఆ తరువాత ఎన్సీపీ చీలిపోయింది. ఈశాన్య రాష్ట్రాలలో ప్రత్యర్థి పార్టీల నాయకులు, శాసనసభ్యులను చేర్చుకోవడం ద్వారా బీజేపీ అక్కడ క్రమంగా విస్తరించింది. ఇప్పుడు పలు ఈశాన్య రాష్ట్రాలలో అధికారంలో ఉన్నది. శాసనసభలలో సంఖ్యా బలాన్ని పెంచుకోవడం కంటే ప్రత్యర్థి పార్టీలను అన్ని విధాలా దెబ్బతీయడమే బీజేపీ అసలు లక్ష్యం. భవిష్యత్తులో తనకు ఏ విధమైన సవాళ్లూ రాకుండా ఉండేందుకు బీజేపీ చాలా పకడ్బందీగా వ్యవహరిస్తోంది. సైద్ధాంతిక నిబద్ధత, కార్యకర్తల విధేయత పరిపూర్ణంగా ఉన్న పార్టీ తమది అని ఒకప్పుడు సగర్వంగా చెప్పుకున్న బీజేపీ, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను పెద్ద ఎత్తున చేర్చుకుంటున్నది. భారతీయ జనతా పార్టీ నిజానికి 'భర్తీ జనతా పార్టీ' అని పలువురు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు. ఈ పరిహాసంలో సత్యం ఉన్నది. వాజపేయి నాయకత్వంలో బీజేపీ ఇతర పార్టీలతో పొత్తులు, సామాజిక సంకీర్ణాలు, ఓటర్లను ఆకట్టుకోవడం ద్వారా విస్తరించింది. ప్రజలను ఒప్పించడం ద్వారానే రాజకీయ విస్తరణ సాధ్యమని వాజపేయి విశ్వసించారు. అయితే మోదీ--షాల నేతృత్వంలోని బీజేపీ రాజకీయ విస్తరణకు ఎమ్ అండ్ ఏ (మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్) నమూనాను అనుసరిస్తోంది. నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలో చేర్చుకోవడం, కొన్ని సందర్భాలలో పార్టీలకు పార్టీలనే కలుపుకోవడం ద్వారా విస్తరిస్తోంది. వాజపేయి, మోదీ నమూనాలు రెండిటికీ పార్టీ పెరుగుదలే లక్ష్యం. అయితే అందుకు అనుసరించిన పద్ధతులు మౌలికంగా భిన్నమైనవి.రాజకీయవేత్తలు సాధారణంగా విజయవంతమైన పార్టీల వైపు ఆకర్షితులవుతారని బీజేపీ మద్దతుదారులు వాదిస్తారు. ఈ వాదన నిస్సందేహంగా నిజమే. అయితే ఇది ఒక రాజకీయ శూన్యంలో సంభవించడం లేదు. మోదీ సర్కార్ తమ నాయకులపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతుందని, ఆర్థిక ఒత్తిళ్లకు లోనుచేస్తుందని, విధేయతలు మార్చుకున్నవారికి ప్రోత్సాహకాలు కల్పిస్తుందని ప్రతిపక్షాలు తరచూ ఆరోపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఉన్న విపక్ష నాయకులు బీజేపీలో చేరితే వారికి ఆ పార్టీ చట్టం నుంచి రక్షణ కల్పిస్తుందనే భావన ప్రజలలో నెలకొనడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల, రాజ్యాంగ వ్యవస్థల నిష్పాక్షికత పైనే కాకుండా ఆ నిష్పక్షికతపై ప్రజల పరిపూర్ణ నమ్మకంపై కూడా ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడ ఆధారపడి ఉన్నది. అయితే ఇప్పుడు ఆ సంస్థల, వ్యవస్థల నిష్పాక్షికతలో ప్రజల విశ్వాసం హరించుకుపోతోంది. ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని చాలా తెలివిగా ఉల్లంఘించడం జరుగుతోంది. ఇటీవల బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు త్రిపురకు చెందిన ఒక అనామక పార్టీలో చేరడమే అందుకొక నిదర్శనం. న్యాయవ్యవస్థ సైతం ఫిరాయింపుల వ్యతిరేక కేసులలో నిర్ణయం తీసుకోవడంలో చేస్తున్న జాప్యం ఆ

# కేసులెన్ని నమోదైనా.. ఐ డోంట్ కేర్..!?

## 'నా పని నేను శుభ్రంగా చేసుకుంటూ పోతా.. అంతే..!

- ఇది మందమర్రి ఏఈ బొంకూరి శ్రీనివాసుడి అహంకార ధోరణి
- ఎన్ని వార్తలు, కథనాలు వచ్చినా.. నన్నేవరూ, ఏమీనూ చేయలేరంటూ కౌంటర్లు
- ఎట్టి పరిస్థితుల్లోనూ భూముల కబ్జాలు, సెటిల్ మెంట్లు ఆగవంటూ పొగరు మాటలు
- మందమర్రిలోనే ఉంటా.. నన్నెవరూ బదిలీ చేయలేరని వెర్రి వాగుడు



**మంచిర్యాల,జూన్ 25,(మన సమాజం):** 'ఎన్ని కేసులు నమోదైనా.. ఐ డోంట్ కేర్..' ఈ మాట అంటున్నది ఎవరని తెలిస్తే అవాక్కవుతారు. మందమర్రి టీఎస్ఎన్ పీడీసీఎల్ ఏఈ బొంకూరి శ్రీనివాసుడు. అంత అహంకార పూరితంగా మాట్లాడడానికి అనేక కారణాలు ఉన్నాయి. పుట్టిన గడ్డ అయిన మందమర్రిలో ఏఈగా ఉజ్జోగం వెలగబెడు తూ.. రియల్ ఎస్టేట్ దందా చేస్తూ లక్షలు,కోట్లు కూడబెడుతుండడమే ప్రధాన కారణం.దీనికి తోడు స్థానిక నాయకుల అండద ండలు, ఓ సబ్ ఇన్ స్పెక్టర్ సాన్నిహిత్యం కూడా ఈ ఎకసెక్కాల మాటలకు మరో కారణంగా చెప్పవ చ్చు. అన్ని విధాలా సహాయ సహకారాలు, దండుకున్నంత డబ్బు వచ్చి పడుతున్నందునే దేనికైనా తెగించి పోతున్నాడనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఇతగాడు ఇంక ఎంత దూరం వెళ్ళాడంటే.. పేపర్లల్లో ఎన్ని వార్తా కథనాలు వచ్చినా తనను ఇక్కడి నుండి ఇసుమంతైనా కదిలించ లేరనే ధీమా వ్యక్తం చేస్తున్నాడంటే ఎంతటి ఘనాపాటి అనుకోవాలి మరీ..!

మంచిర్యాల జిల్లా మందమర్రి టీఎస్ఎన్ పీడీసీఎల్ లో విధులు నిర్వర్తిస్తున్నాడు ఏఈ శ్రీనివాసుడు. తాను పుట్టి పెరిగిన ఊరిలోనే అత్యున్నత ఏఈ పోస్ట్ రావడంతో ఇక ఆ హోదాను పక్కదారి పనులకు పురమాయించాడు. భూ కబ్జాలు సెటిల్ మెంట్ల దందాకు తెర తీశాడు. దశాబ్ద కాలంగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తుండడంతో అతగాడి ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. ఎక్కడ భూమి కనబడితే అక్కడ భూమి కబ్జా చేయడం తన పరమావధిగా పెట్టుకున్నాడు ఈ ఏఈ శ్రీనివాసుడు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలో జంప్ జిలానీ లాగా దూరుతూ భూ దందాలు, సెటిల్ మెంట్లు చేస్తున్నాడు. నాయకులు సైతం నాలుగు రాళ్ళు వెనకేసుకోవచ్చనే ఇతగాడితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. వీరి గూడుపుఠాణీలకు మరో ఖాకీ సార్ దోస్త్ కావడంతో ఈ ఏఈ వ్యవహారాలు మూడు ప్లాట్లు ఆరు రిజిస్ట్రేషన్ల లాగా కొనసాగుతున్న వైనమిది. కేవలం పోస్ట్ ను అడ్డం పెట్టుకొని ఈ దందాలు చేపడుతున్నాడని పలువురు పట్టణ ప్రజలు వాపోతున్నారు.

### ఎన్ని వార్తలు వచ్చినా.. ఏం కాదు..!

'తనపై పత్రికల్లో వార్తలు వచ్చినా తనకేం కాదు..?' అనే ధీమా ఆ ఏఈలో చెక్కు చెదరడం లేదని తెలుస్తోంది. అంటే రాజకీయ నాయకుల మైత్రి, ఖాకీ సార్ స్నేహం అంత బలంగా ఉండడమే దీనికంతటికి కారణమని చెప్పొచ్చు. 'మన సమాజం'లో ఇటీవల ఒక కథనం వచ్చినా.. 'ఎన్ని కేసులైన ఎదుర్కొంటా, నన్నెవరూ ఏమీ చేయలేరు. ఎక్కడికి బదిలీ చేయరు' అంటూ ప్రగల్భాలు పలికే స్థాయిలో మాట్లాడుతుండడం గమనించదగ్గ విషయం. కనీసం తనను ఏ అధికారి కూడా టచ్ చేయలేరు అంటూ మొండిగా వ్యవహరించే ఈ ఏఈ పై సామాన్యులు చేస్తున్న ఫిర్యాదులు బుట్టదాఖలే అవుతున్నాయి. ఇప్పటికైనా.. దీర్ఘకాలి కంగా ఒకే చోట కదలకుండా మెదలకుం డా పాతుకు పోయిన ఈ ఏఈ పై బదిలీ వేటు వేసి అక్రమంగా సాగుతున్న భూ దందాలు, సెటిల్ మెంట్లకు ఉన్నతాధికారులు చెక్ పెట్టాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏం జరుగుతుందో.. టీఎస్ఎన్ పీడీసీఎల్ ఉన్నతాధి కారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి..!

# ప్రజా రవాణాకు 300 కొత్త బస్సులు

- రూ.127 కోట్లతో కొత్త బస్సుల సేవలకు శ్రీకారం
- ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం
- కొత్త బస్సులో ప్రయాణించిన ముఖ్యమంత్రి విజయ్







**చెన్నై, జూన్ 25 :** తమిళనాడు ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు వేసింది. రవాణా శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 300 కొత్త బస్సులను ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ గురువారం ప్రజలకు అంకితం చేశారు. సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెండా ఊపి బస్సుల సేవలను ప్రారంభించారు. ప్రభుత్వ రవాణా సంస్థల కోసం రూ.127 కోట్ల 21 లక్షల వ్యయంతో ఈ బస్సులను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కొత్త బస్సుల రాకతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి.ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి విజయ్ స్వయంగా నగర రవాణా సంస్థకు చెందిన 29ఏ మార్గంలోని కొత్త బస్సులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికులతో కలిసి కొంత దూరం ప్రయాణిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజా రవాణా సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదనే సందేశాన్ని ఈ సందర్భంగా ఇచ్చారు. రాష్ట్రంలో పాత బస్సుల స్థానంలో దశలవారీగా కొత్త వాహనాలను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల నిర్వహణ వ్యయాలు తగ్గడమే కాకుండా ప్రయాణ భద్రత కూడా మెరుగుపడుతుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మరింత బలపడనుంది.కొత్త బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలు కల్పించినట్లు రవాణా శాఖ వెల్లడించింది. రద్దీ మార్గాల్లో అదనపు బస్సులను నడపడం ద్వారా ప్రయాణికుల ఇబ్బందులు తగ్గుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రవాణా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసింది. కొత్త బస్సుల ప్రవేశంతో ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాలు అందనున్నాయి. రాష్ట్ర రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# బ్రహ్మోస్ క్షిపణులతో మరింత శక్తివంతమైన వైమానిక దళం

- 40 సుఖోయ్ యుద్ధ విమానాలకు బ్రహ్మోస్ అనుసంధానం
- దూర లక్ష్యాలపై కచ్చితమైన దాడుల సామర్థ్యం పెంపు - తదుపరి తరం క్షిపణుల అభివృద్ధిపై దృష్టి

**న్యూఢిల్లీ, జూన్ 25** భారత వైమానిక దళం తన దీర్ఘ శ్రేణి దాడి సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసింది. ఇప్పటికే 40 సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాలకు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను అనుసంధానం చేయడం ద్వారా భూ, సముద్ర లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసే సామర్థ్యాన్ని పెంచుకుంది. వైమానిక దళంలో కీలక పాత్ర పోషిస్తున్న సుఖోయ్ యుద్ధ విమానాలు, బ్రహ్మోస్ క్షిపణుల కలయిక దేశ రక్షణ వ్యవస్థకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. యుద్ధ విమానం పరిధి, క్షిపణి దాడి సామర్థ్యం కలిపి వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే శక్తిని అందిస్తున్నట్లు రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. సుమారు 2.5 టన్నుల బరువు కలిగిన వైమానిక బ్రహ్మోస్ క్షిపణిని ప్రత్యేకంగా సుఖోయ్-30 ఎంకేఐ వేదికకు అనుగుణంగా రూపొందించారు. దీనివల్ల శత్రు లక్ష్యాలను సురక్షిత దూరం నుంచే ధ్వంసం చేసే అవకాశం లభిస్తోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్రహ్మోస్-ఎన్‌జీ అనే తేలికపాటి నూతన తరం క్షిపణి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ క్షిపణిని తేజస్, రఫేల్, భవిష్యత్తులో అభివృద్ధి చెందుతున్న అధునాతన యుద్ధ విమానాల్లో వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతేకాకుండా భారత్, రష్యా సంయుక్తంగా అత్యంత వేగవంతమైన బ్రహ్మోస్-2 హైపర్‌సోనిక్ క్షిపణి సాంకేతికత అభివృద్ధిపై కూడా పనిచేస్తున్నాయి. ఇది పూర్తయితే భారత సైనిక సామర్థ్యాలకు మరింత బలం చేకూరనుంది. దీర్ఘ శ్రేణి దాడి సామర్థ్యాన్ని పెంచేందుకు 800 కిలోమీటర్లకు పైగా పరిధి కలిగిన బ్రహ్మోస్ విస్తరిత శ్రేణి రూపాంతరం కూడా అభివృద్ధి దశలో ఉంది.

# కావేరిలో విషాదం

- ఫోటోల మోజులో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి
- రక్షించేందుకు వెళ్లిన వ్యక్తికీ తప్పని మృత్యువు
- మాండ్యా జిల్లాలో హృదయవిదారక ఘటన



**మాండ్యా, జూన్ 25** కర్ణాటకలోని మాండ్యా జిల్లాలో కావేరి నది ఒడ్డున ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫోటోలు దిగేందుకు నదిలోకి వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం సంతోషంగా గడపాలని వెళ్లిన కుటుంబ సభ్యులు క్షణాల్లో మృత్యువాత పడటంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కుటుంబ సభ్యులు ముందుగా కబ్బాలమ్మ, ముత్తితిరాయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని కావేరి నది వద్దకు వెళ్లారు. అక్కడ ప్రకృతి అందాల మధ్య ఫోటోలు దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో విజయమ్మ అనే మహిళ నదిలోకి దిగింది. నీటి ప్రవాహం అంచనా వేయలేక ఆమె ప్రమాదవశాత్తు గల్లంతైంది.విజయమ్మ నీటిలో కొట్టుకుపోతుండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను రక్షించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో చైత్ర, శ్వేత, ప్రియాంకలు కూడా నదిలోకి దిగారు. అయితే ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో వారు కూడా నీటిలో చిక్కుకుని బయటపడలే కపోయారు. క్షణాల్లో పరిస్థితి అదుపుతప్పడంతో అక్కడున్న వారంతా ఆందోళనకు గురయ్యారు. నలుగురు మహిళలు నీటిలో మునిగిపోతుండటాన్ని చూసిన మహేశ్ అనే వ్యక్తి ధైర్యంగా వారిని కాపాడేందుకు ప్రయత్నించాడు. అయితే అతడూ ప్రవాహానికి ఎదురులేక నీటిలో మునిగిపోయాడు. ఒకరిని కాపాడేందుకు వెళ్లిన వారు మరొకరు ప్రమాదంలో చిక్కుకోవడంతో ఈ ఘటన మరింత విషాదకరంగా మారింది.మొత్తం ఏడుగురు నది వద్దకు వెళ్లగా రవి అనే వ్యక్తి, మరో చిన్నారి మాత్రమే సురక్షితంగా బయటపడ్డారు. వారి సమాచారం మేరకు స్థానిక అధికారులు, రక్షణ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పలుగంటలపాటు సాగిన గాలింపు అనంతరం ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వర్షాకాలంలో నదులు, జలాశయాల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఫోటోలు, వినోదం కోసం నీటిలోకి దిగే ముందు పరిస్థితులను అంచనా వేసుకోవాలని సూచిస్తున్నారు. కావేరి నదిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను కలచివేసింది.

# ఆప్ మాజీ అభ్యర్థి మృతి కలకలం

- అనుమానాస్పద మృతిపై కుటుంబం హత్య ఆరోపణలు
- సహజీవనం చేసిన వ్యక్తి కోసం గాలింపు
- నివేదిక తర్వాతే మృతికి కారణంపై స్పష్టత




**రాజ్‌కోట్, జూన్ 25 :** ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ అభ్యర్థి నందని బోస్మియా అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గుజరాత్‌లో కలకలం రేపుతోంది. రాజ్‌కోట్‌లోని ఆమె అద్దె నివాసంలో ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇది ఆత్మహత్య కాదని, హత్య జరిగి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జెట్‌పూర్--నవగఢ్ మున్సిపల్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున పోటీ చేసిన నందని ప్రస్తుతం వైద్య రంగానికి సంబంధించిన సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. రాజ్‌కోట్‌లోని ఆగమన్ సిటీ నివాస సముదాయంలోని ఐదో అంతస్తు ఫ్లాట్‌లో ఆమె నివసిస్తున్నారు. ఫోన్‌కు స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఆమె మృతదేహం కనిపించింది.నందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జునాగఢ్‌కు చెందిన అస్లాం హుస్సేన్ సమాపై పోలీసులు విచారణ చేపట్టారు. అతనికి ఇప్పటికే వివాహం జరిగినప్పటికీ నందనితో కలిసి నివసిస్తున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై ఇద్దరి మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకునేవని పేర్కొన్నారు. అస్లాం తన కుమార్తెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురిచేశాడని, పలు సందర్భాల్లో ఒత్తిళ్లు తెచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో నందనిపై దాడి జరిగిన ఘటనలో కూడా కేసు నమోదైందని కుటుంబ సభ్యులు తెలిపారు.ప్రస్తుతం అస్లాం కనిపించకుండా ఉండటంతో పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాథమిక వైద్య పరీక్షల్లో ఉరివేసుకోవడం వల్లే మరణం సంభవించినట్లు తేలినప్పటికీ పూర్తి వివరాలు ఇంకా రావాల్సి ఉంది. పోస్టుమార్టం పూర్తి నివేదిక, ఫోరెన్సిక్ పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇది ఆత్మహత్యా, హత్యా అనే అంశంపై ప్రస్తుతం ఎలాంటి తుది నిర్ణయానికి రాలేదని స్పష్టం చేశారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనపై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



## నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా

### తాప్సీ సెటైరికల్ కామెంట్స్ వైరల్


సౌత్ నుంచి బాలీవుడ్ వరకు వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి తాప్సీ పన్ను మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2010లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఝుమ్మంది నాదం సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'మిస్టర్ పర్ఫెక్ట్', 'వీర', 'మొగుడు', 'దరువు', 'షాడో', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తెలుగులో ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోవడంతో బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో మాత్రం తాప్సీ తన కెరీర్‌ను పూర్తిగా మలుచుకున్నారు. గ్లామర్ పాత్రలకు భిన్నంగా కథా ప్రాధాన్యత గల పాత్రలను ఎంచుకుంటూ నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా పింక్, నామ్ శభాన, థప్పడ్, ముల్క్ వంటి సినిమాలతో ఆమె నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను ఎంచుకోవడం ఆమె ప్రత్యేకతగా మారింది. ఇటీవల ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాపిడ్ ఫైర్ రౌండ్‌లో "మీకు ఇష్టమైన రాజకీయ నాయకుడు ఎవరు? నరేంద్ర మోదీనా? లేక రాహుల్ గాంధీనా?" అనే ప్రశ్న ఎదురవ్వగా తాప్సీ నవ్వుతూ మోదీ ఫోటో వైపు చేతులు జోడించి నమస్కారం చేశారు. వెంటనే "నాకు ఇంకా ఈ దేశంలోనే ఉండాలని ఉంది" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. కొందరు ఆమె చమత్కారాన్ని మెచ్చుకుంటూ స్మార్ట్‌గా హ్యాండిల్ చేసిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో విశ్లేషిస్తూ ట్రోలింగ్‌కు దిగుతున్నారు. అభిమానులు మాత్రం తాప్సీ ఎప్పటిలాగే బోల్డ్‌గా మాట్లాడిందని ఆమెకు మద్దతు ఇస్తున్నారు. ఇక గతంలో కూడా తాప్సీ టాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో హీరోయిన్‌లకు సరైన ప్రాధాన్యం ఉండదని, మహిళా పాత్రలకు కథలో బలం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తాజాగా "నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా" అన్న ఒక్క మాటతో మళ్లీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చారు. ఆమె కామెంట్స్‌పై ఇంకా చర్చ కొనసాగుతూనే ఉంది.

## శ్రీలీలని పలకరిస్తున్న వరుస ఫ్లాపులు..

### అయిన కూడా ఏకంగా స్టార్ హీరో సరసన ఛాన్స్?



సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లలో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లు--ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది. ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇ55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచుకోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా కథను డిజైన్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే, శ్రీలీల కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ సోషల్ మీడియాలో అజిత్-శ్రీలీల కాంబినేషన్‌పై చర్చలు జోరుగా సాగుతున్నాయి.



## 'బ్లడీ రోమియో'తో రొమాన్స్?

ఒక్క భారీ హిట్ చాలు కథానాయికల జాతకం మారిపోవడానికి. బాలీవుడ్ హీరోయిన్ త్రిప్తి డిమ్రి విషయంలో అదే జరిగింది. 'యానిమల్' సినిమాతో ఈ భామ యువతరంలో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అంతకుముందు ఈ సొగసరి హిందీలో ఐదు చిత్రాల్లో నటించినా అంతగా గుర్తింపు రాలేదు. 'యానిమల్'తో ఒక్కసారిగా అగ్ర కథానాయికల జాబితాలో చేరిపోయింది. ప్రభాస్ 'స్పిరిట్' చిత్రం ద్వారా ఈ భామ తెలుగులో ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం త్రిప్తి డిమ్రి తెలుగులో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నట్లు తెలిసింది. నాని కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' పేరుతో ఓ చిత్రం తెరకెక్కబోతున్నది. ఇందులో త్రిప్తి డిమ్రిని కథానాయికగా ఖరారు చేసినట్లు సమాచారం.

## మెగా మూవీలో చాన్స్?

మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న అనస్వర రాజన్.. 'చాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. ప్రస్తుతం భాషలకు అతీతంగా సినిమాలు చేస్తూ ఈ మలయాళభామ చాలా బిజీగా ఉంది. ఈ క్రమంలో ఈ టాలెంటెడ్ యాక్ట్రస్‌కి టాలీవుడ్‌లో మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. తండ్రీకూతుళ్ల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా సాగే పవర్‌ఫుల్ కథతో తెరకెక్కనున్న ఈచిత్రంలో చిరంజీవి కూతురు పాత్రకు చాలామంది యంగ్ క్రేజీ కథానాయికలను అనుకున్నారు. అయితే.. ఆ అవకాశం చివరకు అనస్వర రాజన్‌ని వరించిందని తెలిసింది. కూతురు పాత్రకు ఈ కథలో అత్యంత ప్రాధాన్యత ఉండటంతో ఈ బరువైన పాత్రకు అనస్వరరాజన్ అయితేనే న్యాయం చేకూర్చగలదని దర్శకుడు బాబీ భావించారట. త్వరలోనే టీమ్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

